సూత్రించాడు. ("శేష షష్ఠికి యొక్కయునగు" (బాలవ్యా. కారక.:15))

తక్కిన షష్ఠీ విభక్తి ప్రత్యయం /-కున్~ -కిన్/ చేరేపుడు "-న" అనే అధికాంశం (increment) కూడా చేరుతుంది. దీనికి సంబంధించిన చర్చ అధికాంశం అనే విభాగం (చూ. 3.6.5.1)లో ఉంది. శ్రీరామాయణంలో /-కున్~ -కిన్/ కింది అర్థాల్లో ప్రయుక్తమవుతుంది.

(i) గమ్యార్థం:

"కర్మకు, కర్తకు గమ్యం అయిన నామబంధానికి -కు చేరుతుంది. నిజానికి కర్తచేరే చోటును మాత్రమే గమ్యంఅని వ్యవహరించటం సంప్రదాయం. కర్మను కర్త 'దానం' చేయటం (ఇవ్వటం) చేత కర్మ చేరేది (లేదా కర్మను పొందేది) సంప్రదానం. ఇక్కడ రెంటియందు కనిపించే 'చేరటం' అనే సమాన ధర్మాన్ని పురస్కరించుకొని 'కర్మకు, కర్తకు గమ్యం అయిన నామ బంధానికి -కు వస్తుంది' అని చెప్పటం జరిగింది. అంతే కాకుండా గమ్యం (దానితోపాటు గమనం కూడా) అది కర్మకైనా, కర్తకైనా భౌతికం, బౌద్ధికం అని రెండు విధాలుగా గుర్తించవలసి ఉంటుంది. భౌతిక గమనంలో ఒక చోటును వదలటం, మరొక చోటును చేరటం ఉంటుంది. బౌద్ధిక గమనంలో గమ్య గమనాలు భావనాత్మకాలు. ఒక్కొక్కప్పుడు గమనం పరిణామంవల్ల తెలుస్తుంది..." "గమన క్రియ యొక్క కర్తకు గమ్యం అయిన నామ బంధానికి -కు వస్తుంది" "స్థలవాచకంకాని నామ బంధాలను "దగ్గర" అనే అనుబంధం చేర్చి స్థల వాచకంగా మార్చాలి." (రామనరసింహం, 2002:5, 6)

గ్రాంథిక భాషలో 'దగ్గర' కు బదులుగా వద్ద, కడ, వంటి అనుబంధాలు చేరతాయి.

అవ్వలి శిఖరమునకేఁగి (4:259, 60)
తన గృహంబునకేఁగి (4:5729)

భగీరథుని కడకు వచ్చుట (1:3357 తర్వాతి వచనంలో)
అతవి! నీకడకు నిపుడు(1:3637, 38)
తండ్రి వద్దకు (2:11914 తర్వాతి వచనంలో)

(ii) సంప్రదానార్థం:

"కర్మకు గమ్యమైన నామ బంధం సంప్రదానం లేదా అముఖ్య కర్మ. కర్తచేసే చెప్పటంవంటి పనిచేత, ఇవ్వటం/పంపటంవంటి పనులచేత కర్మ గమ్యాన్ని చేరుతుంది. లేదా అముఖ్య కర్మ ముఖ్య కర్మను పొందుతుంది. చెప్పటంవల్ల చేరే గమ్యం బౌద్ధికం; ఇవ్వటంవల్ల చేరే గమ్యం

భౌతికం, బౌద్ధికం కూడా ఉదా. వాడికి నా అడ్రసు ఇచ్చాను (బౌద్ధికం అయిన గమన గమ్యాలు)" (రామనరసింహం, 2002:5)

వనితామణికి స్వస్తి-వాదంబొసంగి (1:4554)
నీ కిప్పింతుననుచుఁ (4:1781)

వచ్యార్థాముఖ్య కర్మకు "-కు"

వచ్యర్థ క్రియల వల్ల చెప్పబడే సమాచారం చేరే గమ్యం అముఖ్య కర్మ.

"... ఆ దైత్య-సతుల కిట్లనియె" (5:1964)
"... వానరోత్తముల కిట్లనియె" (6:152)
"చనువుతో శ్రీరామ-చంద్రున కనియె" (6:1776)

(iii) అనుభోక్త్రర్థకం:

"అనుభోక్తృ-అనుభోజ్య సంబంధం కల వాక్యాలలో అనుభోక్త ఉదాసీనం (inactive) అయి, అనుభోజ్యం క్రియాశీలం (active) అయినప్పుడు ఉదాసీనం అయిన అనుభోక్తకు "-కు" చేరుతుంది." "రవికి ఉత్తరం వచ్చింది. నాకు ఉద్యోగం వచ్చింది. ..."ఇటువంటి వాక్యాలు తెలుగు, మరికొన్ని భారతీయ భాషలకు విశిష్టమైనవి. ఈ వాక్యాలను ఆంగ్ల వాక్యాలతో పోల్చినపుడు ఆంగ్ల వాక్యాలలో అనుభోక్త క్రియా శీలంగా ఉన్నట్లు (నిజానికి కాకపోయినప్పటికీ) గ్రహించవచ్చు. ఉదా. Ravi got a letter అన్న వాక్యాన్ని 'రవికి ఉత్తరం వచ్చింది' అనే తెలుగు వాక్యంతో పోల్చి చూస్తే ఉత్తరం రావటంలో రవి ప్రమేయం ఏమీ లేకపోయినప్పటికీ ఆంగ్ల వాక్యంలో రవి అనే కర్త క్రియా శీలంగా చూపబడినట్లు తెలుస్తుంది. అదే తెలుగు వాక్యంలో 'రవి' ఉదాసీనమైన అనుభోక్తగానూ, 'ఉత్తరం' క్రియాశీలం అయిన అనుభోజ్యంగానూ చూపటం జరిగింది. (Ramanarasimham 1989; Ushadevi, 2001) "తెలుగులో ఇటువంటి వాక్యాలలో క్రియాశీలమైన అనుభోజ్యం అభిహితం (క్రియచేత చెప్పబడినది) అవుతుంది. అప్పుడు అనుభోక్తకు -కు చేరుతుంది" (రామనరసింహం 2002:8)

శ్రీరామాయణంలో ఇందుకు ఉదాహరణలు:

"కపీశ కోటికి నెల్ల-గీడావహిల్లు" (4:6008)

ఇందులో కపీశకోటి ఉదాసీనమైన అనుభోక్తలు. కీడు క్రియాశీలమైన అనుభోజ్యం.

(iv) ప్రయోజనార్థం

"ప్రయోజనమే లక్ష్యం అయి ఆ ప్రయోజనాన్ని సాధించే క్రియ అధ్యాహార్యం అయినపుడు/కానపుడు" (రామనరసింహం, 2002:6) ఆ ప్రయోజనాన్ని తెలిపే నామానికి "-కు" చేరుతుంది.

"బ్రహ్మాస్త్రమేకాని-పనికి రాదోకటి" (6:716)

దీనిలో బ్రహ్మాస్త్రం పని(చేయటాని)కి అనేది ప్రయోజనార్థంలో ఉపయోగించబడింది.

(v) సంబంధార్థం

జన్య-జనకసంబంధం:

"అతనికిఁ బుట్టితిననుచు..." (1:3345)

తుల్యత్వ సంబంధం

"వాడికి వీడు పోటీ. వీడికి వాడు సాటి; దానికి ఇది సరిపోతుంది. ఈ మందు జ్వరానికి మంచిది... " అనే వాక్యాల్లో తుల్యత్వ సంబంధాన్ని రామనరసింహం (2002:8) వివరించారు.

శ్రీరామాయణంలో కూడా తుల్యత్వ సంబంధంలో "-కు" వచ్చిన ప్రయోగాలున్నాయి.

"కారుగదా సాటి-కాలిగోరునకు" (5:3911)

"కాలిగోరునకు/రారుపోల్పఁగ సుర-ప్రభువులీతనికి" (5:3911, 12)

"పలుగొండ కెనకయైన యట్టి/ఘనమైన దుందుభి-కాయంబుఁజూపఁ"(1:411,412)

# 3.6.6.6 సప్తమీ విభక్తి ప్రత్యయాలు

శ్రీరామాయణం కావ్యభాషలో- /-అన్(ఉ)/, /-న్(ఇ)/, /-అందున్ ~ -అందలి/ /-లోన్~ -లోనన్ ~ -లోపలన్/ అనే ప్రత్యయాలు సప్తమీ విభక్తిలో కనిపిస్తాయి. వీటిలో /-లోన్~ -లోనన్~ -లోపలన్/ అనే ప్రత్యయం సప్తమ్యర్థంలో వస్తున్నదని సంప్రదాయ వ్యాకర్తలు గుర్తించారు. ("నిర్ధారణ షష్ఠికి లోపల వర్ణకంబగు" (చూ. బాలవ్యా. కారక.:16)) ఈ ప్రత్యయాలన్నీ జాతి గుణ క్రియా సంజ్ఞలచేత సముదాయంనుండి ఏకదేశాన్ని సూచించడానికి ఉపయోగించబడతాయి. /-అన్(ఉ)/, /-అందున్ ~ -అందలి/ అనే ప్రత్యయాలు చేరేపుడు ఉదంత నామ ప్రాతిపదికలకి "-న" అనే అధికాంశం (చూ.3.6.5.1) వస్తుంది.

శ్రీరామాయణం కావ్యం నుంచి ఇందుకు ఉదాహరణలు

(i) /-అన్(ఉ)/

దినంబునను (1:346)
నంది గ్రామమునను (1:346)

(ii) /-న్(ఇ)/

ఈ ప్రత్యయం ఇదంత ప్రాతిపదికలపై వస్తోంది.

బలిమిని (2:5396)
మంచు గుబ్బలిని (3:1357)

(iii) /-అందున్ ~ -అందలి/:

ఊరువులందుఁ (3:4205)
కన్నులందుఁ (3:4371)
కాలంబులందు(3:4449)
భూతములందు (3:5483)

(iv) /-లోన్~ -లోనన్~ -లోపలన్/

కలనిలో(1:472)
ఇంటిలోన (1:15)
ఉల్లంబులోన (1:220)
నదులలో (1:283)
లంకలోఁ (1:733)

వనములోపలను (1:2743)
విడిది లోపలను (1:5016)
మడువులోపలను (1:3052)
సరము లోపలను (1:3284)
ఇండ్ల లోపలను (1:5768
డెందంబులోనఁ (2:7958)

వీటి లోపల (1:3778)
కొలను లోపలఁ(1:5421)

'అందు' స్వతంత్ర పదంగా ఉన్న ప్రయోగాలు శ్రీరామాయణంలో కనిపిస్తున్నాయి.

అందున కొక విఘ్నము (6:8389)
అందుకు నలిగి (6:9447)
అందుచే లంక (6:10143)

## 3.6.6.7 సంబోధన ప్రథమా విభక్తి

తత్సమ దేశ్య శబ్దాల చివరి అచ్చు సంబోధనలో వికల్పంగా దీర్ఘాన్ని పొందుతుంది. బహువచనంలో వీటికి "ఆరగాగమం" వస్తుంది. వీటిని చిన్నయసూరి *బాలవ్యాకరణం* తత్సమ పరిచ్ఛేదం((14-16, 32-37))లో చర్చించాడు. ("ఓ యామంత్రణంబునందగు", "ఓ శబ్దంబునకుం బురుష నీచస్త్రీ పురుషామంత్రణంబులందు యి-సి-రి వర్ణంబులు విభాష నంతాగమంబులగు", "ఒరి యోసి మైత్రియందుం గలవు", "సంబోధనంబునం దేకార్థంబయిన పదంబు తుది యుకారంబున కకారం బగు", "సంబోధనంబునందుఁ బదంబు తుదియాకారేకారంబులకు దీర్ఘంబు విభాష నగు", "కృతోత్కంబగు సంస్కృత నామంబు సంబుద్ధి డుఙ్జునకు లోపంబు విభాషనగు",

"ఉదంత సంస్కృత నామంబుమీఁది సంబుద్ధి డుజ్జునకు నూకారంబు ప్లుతం బాదేశంబు విభాషనగు", "సంబోధనంబునందు బహు వచనంబున కారగాగమంబగు", "మధ్యమ పురుష యోగంబునం దారగాగమంబు విభాష నగు")

తత్సమ శబ్దాలలో:

(i) దీర్ఘం వచ్చిన రూపాలు

గోదావరీ! (3:4239)
జానకీ! (3:5776)
లక్ష్మణా! (4:590)

(ii) దీర్ఘం రాని రూపాలు

లక్ష్మణ! (1:826)
దేవ!(1:147)
మునినాథ! (1:227)
భరద్వాజ!(1:527)
నిషాద! (1:553)
యోధులార! (6:7355)
కపులార! (6:4353)

దేశ్య శబ్దాలలో:

(iii) దీర్ఘం వచ్చిన రూపాలు

తమ్ముఁడా! (4:96)

(iv) దీర్ఘం రాని రూపాలు

అయ్య! (4:2031)
ఏమయ్య! (4:2019)
అన్న!(2:6903)
అన్నలార!

అయ్యలార! (4:5518)
ఎలనాఁగలార!(1:2787)

(v) సంబోధనలో- సంబోధ్య వాచకానికి ముందు"-ఓ " చేరటం కనిపిస్తుంది. బహు వచనంలో ఈ నామాలకు "ఆరగాగమం" వస్తుంది.

ఓయయ్యలార! (4:5889)
ఓరామ! (5:2546)
ఓయమ్మలార! (5:2165)

(vi) మహ దమహత్ సంబోధ్య వాచకాలకు ముందు మైత్రీ సూచక -ఓయి, -ఓరి, లు చేరిన ఉదాహరణలు శ్రీరామాయణంలో ఉన్నాయి. -ఓసి చేరిన రూపం ఒక్కటే ఉంది.

-ఓయి: ఓయివానరవీర! (5:181)
ఓయిసమీర! (6:381)
ఓయిభానుజ! (6:4339)

-ఓరి: ఓరిమూఢాత్మ! (6:8503)
ఓరినిషాద! (1:553)

-ఓసి: "ఓసి!(మేనకను ఉద్దేశించి-విశ్వామిత్రుడు;)
యింద్రుఁడవంప-నుప్పొంగి వెళ్ళిఁ/జేసి నా తపమెల్లఁ జెఱచి..." (1:4627, 28)

## 3.6.6.8 సంబుద్ధి పదాలు

స్త్రీ వాచక పదాలమీద సంబుద్ధిలో "-రో" ప్రత్యయం చేరిన రూపాలు శ్రీరామాయణంలో కనిపిస్తున్నాయి.

అమ్మరో! (2:6907)
ఇంతిరో! (3:3983)

### 3.6.6.8.1 "-ఓ"మీద -రోరో చేరటం:

"-ఓ" అనే సంబుద్ధిమీద "-రోరో" చేరి మహదర్థంలో ప్రయుక్తమైన రూపం రామాయణంలో ఒకటి కనిపిస్తోంది.

ఓరోరో! (6:7499)

"... ఓరోరో! నీ-కఠిన భావంబు మానుదువే మంచి-మాటల?..."

## 3.6.6.9 విభక్తి విపర్యయం (functional syncretism)

"ఒకానొకచో నొక విభక్తికి మఱియొక విభక్తియునగు" (బాలవ్యా. కారక.:21) అని వివరించినట్టుగా ఒక విభక్తి ప్రత్యయం రావలసిన తావుల్లో మరొక విభక్తి ప్రత్యయం రావటం జరుగుతుంది. శ్రీరామాయణంలో ఇటువంటి విభక్తి విపర్యత గుర్తించబడింది.

తృతీయకు ద్వితీయ

"పాటల నాటల-పంచసాయకుని" (పాటలతో ఆటలతో) (1:1011)

# 3.7 విశేషణాలు (adjectives)

వ్యక్తుల, వస్తువుల గుణ ధర్మాలను తెలిపే పదాలే విశేషణాలు. రెండు నామాలు ఒకచోట చేరినపుడు(సమాసంలో) ఒకటి విశేషణంగా మరోటి విశేష్యంగా, స్థాన మార్పునుబట్టి విశేషణం-విశేష్యంగా, విశేష్యం-విశేషనణంగా మారే అవకాశం తెలుగుభాషలో ఉంది. తెలుగు విశేషణాలకు ప్రత్యేకంగా లింగ, విభక్తి, వచనాలు లేకపోవడం ఇందుకు కారణం.

వాక్యనిర్మాణంలో- విశేషణం దాని తర్వాత వచ్చే నామానికి గుణవాచకం(attribute (నామంయొక్క ధర్మాన్ని తెలిపేదిగా)) పనిచేస్తుంది.

విశేషణాలను సిద్ధ విశేషణాలు, నిష్పన్న విశేషణాలు అని రెండు ముఖ్య తరగతులుగా విభజించవచ్చు.

## 3.7.1 సిద్ధ విశేషణాలు

వీటిలో విశేషణాలు సమాస పూర్వపదంగానే కనిపిస్తాయి.

కడుభీతి (2:3188)
గొప్ప భూరుహము (5:3652)
గొప్పయేనుఁగు (6:5051)
నిండు తాపము (2:6410)
నిండు జవ్వనము (3:1483)
మంచి రూపము (1:2781)
మంచి మాట (4:5265)
పెనుభేరి(3:2149)

## 3.7.2 నిష్పన్న విశేషణాలు

ఇవి ప్రాథమిక విశేషణాలనుండి నిష్పన్నమవుతాయి. నామవాచక, సర్వనామ, క్రియాధాతువులకు ప్రత్యయాలు చేరి ఇవి ఏర్పడతాయి. వీటిని నాలుగు రకాలుగా విభజించవచ్చు. అవి;

1. నామిక విశేషణాలు (nominal adjectives)
2. సార్వనామిక విశేషణాలు(pronominal adjectives)
3. సంఖ్యావాచక విశేషణాలు(numeral adjectives)
4. ధాతుజ విశేషణాలు (verbal adjectives)

### 3.7.2.1 నామిక విశేషణాలు (nominal adjectives)

వీటిలో నామం షష్ఠీవిభక్తి రూపంలో ఉండి విశేషణంగా పనిచేస్తుంది. ఇలా పనిచేయడాన్ని సంప్రదాయ వ్యాకరణాలు "సంబంధం" అన్నాయి.

చంద్రుని మేను(3:2195)
ఖరుని యంగము(3:2226)
విభీషణుని కారుణ్య పరత (1:473)
ధీ విశాలుని దివ్యతేజో విలాసు (1:1322)
నలుని నశ్వినుల (1:1649)

## 3.7.2.2 సార్వనామిక విశేషణాలు (pronominal adjectives)

సర్వనామాలు(చూ.3.8)లో చర్చించిన సార్వనామిక విశేషణాలతో పాటు నిర్దేశక (చూ. 3.8.1.3 ), ప్రశ్నార్థక (చూ. 3.8.1.4), అనిర్దిష్ట (చూ. 3.8.1.5)సర్వనామాలుకూడా విశేషణాలుగా ప్రవర్తిల్లుతాయి. సార్వనామిక విశేషణాలకు సంబంధించిన చర్చ 'సర్వనామాలు' అనే విభాగంలో(చూ.3.8)ఉంది.

### 3.7.2.2.1 నిర్దేశక విశేషణాలు (demonstrative adjectives)

| దూరవర్తి | సమీపవర్తి |
|---|---|
| అవ్వేళ(3:1690) | ఇవ్వేళ(1:570) |
| అత్తరి(3:2092) | ఇయ్యవమతి (4:1515) |
| ఆవేళ(1:1709) | ఈ మాంసము (4:1661) |
| ఆరాత్రి(1:2073) | ఈ చర్మము(4:1661) |
| ఆధ్వని(1:2255) | ఈ దంతము(4:1661) |

### 3.7.2.2.2 ప్రశ్నార్థక విశేషణాలు (interrogative adjectives)

ఏ: ఎవ్వారు(2:6979)
ఏలయ్య (1:599)
ఏనాఁట నుండి (1:2879)

### 3.7.2.2.3 అనిర్దిష్ట విశేషణాలు (indefinite adjectives)

(i) అనిర్దిష్ట రాశి (mass)విశేషణాలు:

కొంత: కొంత దూరంబు (2:5309)
కొంత తురగ బృందంబు (2:6801, 802)
కొంత సేపు (3:1073, 5:1463)

(ii) అనిర్దిష్ట గణ్య (count) విశేషణాలు:

మనుష్య వాచకాలు:

కొందఱు: "కొందఱు హరిగోళ్ళ(-గొందఱు పుట్ల
గొందఱు దోనుల(-గొందరీతలను
కొందఱు తెప్పలం-గొందఱు క్రొత్త
బిందెల నీరీతి(-బేర్చి యందఱును" (2:8161-64)

అమనుష్య వాచకాలు:

కొన్ని: కొన్ని నాళ్ళకు (1:4670)
కొన్ని చల్లనీరును (1:4973)
కొన్ని దీనార కోటియు (1:5489, 90)
కొన్ని హాస్యములు (2:6652)
కొన్నిపదంబులు (2:6653)
కొన్ని పద్యములు(2:6653)
కొన్ని ప్రసంగముల్(2:6654)
కొన్ని యాటలును (2:6654)

## 3.7.2.3 సంఖ్యావాచక విశేషణాలు (numeral adjectives)

వీటికి సంబంధించిన విపులమైన చర్చ సంఖ్యావాచకాలు (చూ.3.9) అన్న విభాగంలో ఉంది.

ఒక తూపు(4:1379)
ఒక చాయ (4:2851)
మూ(డు లోకములు (6:1830)
మూ(డు యోజనము (6:2237,38)
నాల్గు వంకలు (6:7151, 52)
నాల్గు త్రోవలు (6:7274)

## 3.7.2.4 ధాతుజ విశేషణాలు (verbal adjectives)

ఇవి క్రియా విజ్ఞానం(చూ.4.3.1.2.2)లో విపులంగా చర్చించబడ్డాయి.

## 3.7.3 సార్వనామిక రూపాలు

విశేషణాలమీద -వాఁడు/-ఆఁడు, -అది/-ది, -వారు, -అవి/-వి మొదలైన సార్వనామిక అనుబంధాలు చేరి సార్వనామిక రూపాలు ఏర్పడతాయి. ఇవి సర్వనామాలుగానూ, నామాలుగానూ పనిచేస్తాయి.

## 3.7.3.1 సార్వనామిక అనుబంధాలు

వీటిలో మహద్వాచకాలకు -వాడు/-ఆఁడు, అమహద్వాచకాలకు -అది/-ది, బహువచనంలో మహన్మహతీవాచకాలకు -వారు, మహతీరామహత్తులకు -అవి/-వి అనే సార్వనామిక అనుబంధాలు చేరతాయి.

-వాఁడు/-ఆఁడు:

ఎవ్వాఁడు (1:231)
వలయువాఁడు(1:232)
నగుమోమువాఁడు(1:254)
చిందపుమెడవాఁడు(1:254)
ఎగుభుజంబులవాఁడు (1:253)
చక్కనివాఁడు (1:287)
నల్లనివాఁడు(1:1593)
వెన్నెలలు చల్లెడువాఁడు (1:1593, 94)
పదియేనేండ్లవాఁడు (1:1863)

-అది/-ది:

మంచిది (1:1943)
పాపాత్మురాలిది (1:2183)

-వారు:

పగవారు (2:1129)
పొగడనివారు (2:2223)
మంచివారు(2:2617)
బ్రోచువారు(2:3329)
నమ్మినవారి(2:4660)

-అవి/-వి:

అట్టివి(2:417)
ఎయ్యవి(1:3502)
కలవవి(3:6234)

# 3.8 సర్వనామాలు (pronouns)

## 3.8.1 సర్వనామాలలోని రకాలు

శ్రీరామాయణం కావ్యంలోని సర్వనామాలను కింది విధంగా వర్గీకరించవచ్చు.

1. పురుషవాచక సర్వనామాలు (personal pronouns)
2. ఆత్మార్థక సర్వనామాలు (reflexive pronouns)
3. నిర్దేశక సర్వనామాలు (demonstrative pronouns)
4. ప్రశ్నార్థక సర్వనామాలు (interrogative pronouns)
5. అనిర్దిష్ట సర్వనామాలు (indefinite pronouns)

### 3.8.1.1 పురుషవాచక సర్వనామాలు (personal pronouns)

(i) ఉత్తమ పురుష
ప్రథమా విభక్తి

ఏకవచనం బహువచనం